# కౌశిక్‌రెడ్డి గెలుపు నల్లేరుమీద నడకే

- ప్రజలంతా ఆయన వెంటే ఉన్నారు
- జడ్పీటీసీ, ఎంపీపీ 'బీఆర్ఎస్'ద్రోహులు
- కన్నతల్లిలాంటి పార్టీకి వెన్నుపోటు పొడిచారు
- వారిని ప్రజలు గ్రామాల్లో తిరుగకుండా చేస్తరు
- విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్, దళిత సంఘాల నాయకులు



సమావేశం అనంతరం నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్, దళిత నాయకులు

జమ్మికుంట, నవంబర్ 5: ఎన్నికల్లో బీఆర్ఎస్ హుజూరాబాద్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి గెలుపు నల్లేరు మీద నడకేనని ఆ పార్టీ, దళిత సంఘాల నాయకులు ధీమా వ్యక్తం చేశారు. ప్రజలతో మమేకమై.. ప్రజల కోసమే పనిచేస్తున్న కౌశిక్‌రెడ్డి వెంటే నియోజకవర్గ ప్రజలంతా ఉన్నారని స్పష్టం చేశారు. ఆదివారం జమ్మికుంట పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మండలంలోని మాచనపల్లి మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు పర్లపల్లి రమేశ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్, దళిత సంఘాల యువత, నాయకులు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలో ఎన్ని కుట్రలు పన్నినా.. గులాబీ జెండా ఎగురవేయడం ఖాయమని, కౌశికన్నను భారీ మెజార్టీలో గెలిపించుకుంటామని తెలిపారు. జమ్మికుంట జడ్పీటీసీ శ్రీరాం శ్యాం, ఎంపీపీ దొడ్డె మమత బీఆర్ఎస్ పార్టీ ద్రోహులని, కన్నతల్లి లాంటి గులాబీ పార్టీకి వెన్నుపోటు పొడిచారని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక సామాన్య వ్యక్తులకు పార్టీ టికెట్టిచ్చి గెలిపించుకుని ప్రజాప్రతినిధులుగా గొప్ప అవకాశం కల్పించిందని, అలాంటి పార్టీని విడిచిపెట్టడం సిగ్గుచేటన్నారు. ప్రజా వ్యతిరేక శక్తులైన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు అమ్ముడుపోయారని, నిబద్ధతలేని, నీచమైన రాజకీయాలు చేస్తున్న వ్యక్తులకు ప్రజాక్షేత్రంలో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. పార్టీ నుంచి వెళ్లి పోయిన ప్రజాప్రతినిధులు చెల్లని పైసలని, వారు వెళ్లిపోవడం వల్ల నియోజకవర్గంలో పార్టీకి నష్టమేమీ లేదన్నారు. పార్టీని వీడడం పట్ల బీఆర్ఎస్‌కు పట్టిన శని పోయిందనుకుంటున్నామని, రానున్న రోజుల్లో ప్రజలు వారిని గ్రామాల్లో తిరుగకుండా చేస్తారని హెచ్చరించారు. పార్టీ వీడిన నాయకులు ఏనాడైనా దళిత సామాజిక వర్గానికి సహకరించారా..? చెప్పాలని డిమాండ్ చేశారు. డబ్బుల సంపాదనే ధ్యేయంగా పని చేశారని ఆరోపించారు. పైసలకు అమ్ముడు పోయిన జమ్మికుంట జడ్పీటీసీ, ఎంపీపీ బీఆర్ఎస్ అభ్యర్థిపై అసత్యపు ఆరోపణలు చేయడం తగదని హితవు పలికారు. తర్వాత జై తెలంగాణ.. జై కేసీఆర్.. జై కౌశికన్న.. అంటూ నినాదాలు చేశారు. సమావేశంలో దొడ్డె యుగేంధర్, మంద రాజేశ్, నాగులపల్లి తిరుపతి, గాజుల సంపత్, గుల్లి రమేశ్, సముద్రాల సంపత్, రజనీకాంత్, వెంకటేశ్, రాజ్‌కుమార్, ప్రశాంత్, రంజిత్, శంకర్, భద్రయ్య, సురేశ్, సంపత్, నరేశ్, శ్రీకాంత్, ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రలోభాలకు లొంగి పార్టీని వీడడం సరికాదు

- నేతలు మారినా ఓటర్లు మా వెంటే
- హుజూరాబాద్ ఎమ్మెల్యేగా కౌశిక్‌రెడ్డి గెలుపు తథ్యం
- బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండ శ్రీనివాస్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండ శ్రీనివాస్

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 5: కొందరు నేతలు ప్రతిపక్ష నాయకుల ప్రలోభాలకు లొంగి కన్నతల్లి లాంటి పార్టీని వీడడం సరికాదని, నేతలు మారినా ఓటర్లు మారని గుర్తించుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండ శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఆదివారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీ బీఫాంపై పోటీ చేసి కేసీఆర్ బొమ్మతో గెలిచి అన్ని పదవులు అనుభవించి ఎన్నికల సమయంలో ప్రతిపక్షాల ప్రలోభాలకు లొంగి పార్టీని విడిచి వెళ్లడం భావ్యం కాదన్నారు. పార్టీ వీడడమే కాకుండా ఎమ్మెల్యే అభ్యర్థి కౌశిక్‌రెడ్డిని స్థాయిని మరిచి విమర్శించడం, బట్టకాల్చి మీద వేయడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. పార్టీ మారే వారిని చూసి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధైర్య పడవద్దని శ్రీనివాస్ సూచించారు. పార్టీ పటిష్టత కోసం పాటుపడే కార్యకర్తలందరికీ తగిన గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజలంతా బీఆర్ఎస్ వెంటే ఉన్నారని, హుజూరాబాద్ ఎమ్మెల్యేగా కౌశిక్‌రెడ్డి గెలుపు తథ్యమని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వర్దినేని రవీందర్‌రావు, రావుల రాజలింగారెడ్డి, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు మొలుగూరి ప్రభాకర్, సోషల్ మీడియా నియోజకవర్గ ఇన్‌చార్జి తులసి లక్ష్మణమూర్తి, సింగపూర్ గ్రామాధ్యక్షుడు ఇజ్జగిరి కుమార్, సీనియర్ నాయకుడు సంపంగి మైకేల్ పాల్గొన్నారు.

# జోరుగా బీఆర్ఎస్ ప్రచారం

- హుజూరాబాద్ 15, 16, 17వ వార్డుల్లో ఓటు అభ్యర్థించిన పాడి శాలినీరెడ్డి
- ఘనస్వాగతం పలికిన మామిళ్లవాడ ప్రజలు



ఓటు అభ్యర్థించిన శాలినీరెడ్డిని ఆశీర్వదిస్తున్న మహిళా ఓటర్లు

హుజూరాబాద్ టౌన్, నవంబర్ 5: ఎన్నికలు సమీపిస్తుండడంతో బీఆర్ఎస్ ప్రచారం జోరందుకున్నది. ఇందులో భాగంగా ఆదివారం పట్టణంలో పార్టీ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి తరఫున ఆయన సతీమణి శాలినీరెడ్డి ప్రచారం నిర్వహించారు. 2, 15, 16, 17వ వార్డులోని మామిళ్లవాడ, గ్యాస్‌గోదాం ఏరియా, మోడల్ చెరువు ఏరియా, ఉర్దూ భవన్ ఏరియా తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లారు. ప్రజలకు బీఆర్ఎస్ మ్యానిఫెస్టో కరపత్రాలు పంచి ఓటు అభ్యర్థించారు. ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కారుగురుపై ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆమెకు మామిళ్లవాడ ప్రజలు పూలు చల్లి, మంగళ హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. ప్రచారంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, వైస్ చైర్‌పర్సన్ కొలిపాక నిర్మల, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, అధ్యక్షురాలు, కౌన్సిలర్ కల్లెపల్లి రమాదేవి, కౌన్సిలర్లు మారపెల్లి సుశీల, ఉజ్మానూరిన్, బర్మావత్ యాదగిరి, కే లావణ్య, ఎం ఉమాదేవి, ఎం సృజన, కే జీవిత, తాళ్లపెల్లి శ్రీనివాస్, ఎం కుమార్‌యాదవ్, ఏ ముత్యంరాజు, ఉమామహేశ్వర్, వీ కిషన్, సీనియర్ నాయకురాలు ప్రభావతిరెడ్డి, కే శ్రీదేవి, పీ లతారెడ్డి, రేణుక, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





ఓటరు అవగాహన కార్యక్రమంలో పాటలు పాడుతున్న సారథి కళాకారులు

## ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 5: ఓటు హక్కు వినియోగంపై తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ఆదివారం పట్టణంలోని పలు చోట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని పాటలు, నాటికల రూపంలో ప్రదర్శనలు ఇచ్చారు. రాజ్యాంగం ప్రజలకు కల్పించిన ఓటు హక్కు ద్వారా మంచి నాయకున్ని ఎన్నుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వడ్లకొండ అనిల్‌కుమార్ బృందం కళాకారులు ఆవునూరి కోమల, మహాదేవుని శ్రీధర్, దొగ్గల రాజు, రావుల తిరుపతి, కొంకటి తిరుపతి, ఎర్ర సురేశ్, రావుల సాయికుమార్, దుగ్గల శ్రీధర్, పద్మ, ఎర్ర సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఏసీపీ



దుద్దనపల్లిలో పోలింగ్‌కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ జీవన్‌రెడ్డి

సైదాపూర్, నవంబర్ 5: మండలంలోని వెన్నంపల్లి, సైదాపూర్, దుద్దనపల్లి, ఘనపూర్, అమ్మనగుర్తి, బొమ్మకల్, రాయికల్ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను హుజూరాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అందరూ సహకరించాలన్నారు. సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టిసారించామన్నారు. ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని, లేకపోతే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట సైదాపూర్ ఎస్ఐ జన్ను ఆరోగ్యం తదితరులు ఉన్నారు.

## మాదిగల విశ్వరూప మహాసభ కరపత్రాల ఆవిష్కరణ



విశ్వరూప మహాసభ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 5: ఈ నెల 11న హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే మాదిగల విశ్వరూప మహాసభ కరపత్రాలను ఆదివారం హుజూరాబాద్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు ఆవిష్కరించారు. శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో కేంద్రం ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలనే డిమాండ్‌తో నిర్వహిస్తున్న మహాసభకు మాదిగ, మాదిగ ఉప కులాల వారు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తునికి వసంత్‌మాదిగ, రుద్రారపు రామచంద్రం, రేణిగుంట్ల సాగర్, మారేపల్లి శ్రీనివాస్, వేల్పుల రత్నం, బొరగాల సారయ్య, డాక్టర్ తడికమళ్ల శేఖర్ పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



రాయికల్ తండాలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అసిస్టెంట్ సీఈవో భిక్షపతి

సైదాపూర్,నవంబర్5: మండలంలోని రాయికల్‌తండా, వెంకటేశ్వర్లపల్లి గ్రామాల్లో వెన్కేపల్లి–సైదాపూర్ సహకార సంఘం ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను అసిస్టెంట్ సీఈవో ఈరాల భిక్షపతి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు తాము పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి విక్రయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు ఉన్నారు.

## నేడు కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

వీణవంక, నవంబర్ 5: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు సీఈవో ప్రకాశ్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని బేతిగల్, వల్భాపూర్, నర్సింగాపూర్, పోతిరెడ్డిపల్లి, కొండపాక, రెడ్డిపల్లి, కోర్కల్, గొల్లపల్లి, మామిడాలపల్లి, ఎలుబాక, గంగారం, బొంతుపల్లి, ఘన్ముక్ల, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దళారులను నమ్మిమోసపోవద్దని, కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని సూచించారు.